## అమ్మవారి ఆలయంలో మాస పూజ

బాసర, నవంబరు 27 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ప్రతి మాసం నిర్వహించే పౌర్ణమి మాస పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు చతుర్వేద సరస్వతీ మంత్ర సహిత చండీ హోమం, గణపతి పూజ, కలశ స్థాపన, రక్షా బంధనము, మండపారాధన, పుణ్యాహవచనం, నిర్వహించారు. ఆలయ సిబ్బంది, అర్చకులు ఉన్నారు.

## ఘనంగా హన్మండ్ల పండుగ

సోన్, నవంబర్ 27: సోన్ మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం గ్రామాల్లో సోమవారం హన్మండ్ల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఏటా కార్తీకపౌర్ణమి సందర్భంగా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల వద్ద అంజనేయ స్వామికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం జారుడుగుంజ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జారుడుగుంజ ఎక్కేందుకు యువకులు పోటీ పడ్డారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్‌లు వెంకాయిగారి హరిత శ్రీనివాస్, అంకం గంగామణి శ్రీనివాస్, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

నిర్మల్ టౌన్, నవంబర్ 27: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది సోమవారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు వివిధ జిల్లాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడంతో ఆ కౌంటర్లలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వేయాలని పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగులకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఇప్పటికే ఫోన్ ద్వారా అభ్యర్థించడంతో ఉద్యోగులు తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు.

## ముగిసిన విఠలేశ్వరుడి జాతర



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

తానూర్(కుభీర్) నవంబర్ 27: మండల కేంద్రం లో వారం రోజులుగా నిర్వహిస్తున్న విఠలేశ్వరుడి జాతర సోమవారంతో ముగిసింది. భక్తులు విఠలారుక్మిణి దేవతా మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి గ్రామస్తులు జాగరణ చేసి వేకువజామునే ఆలయంలో కాగడ హారతితో ఉత్సవాలు ముగించారు. జాతరకు చుట్టు పక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్ర వాసులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎస్ఐ విక్రమ్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ తాడేవార్ విఠల్, మాజీ సర్పంచులు జాదవ్ మాధవ్‌రావు పటేల్, దార్మోడ్ రాములు, ఆలయ కమిటీ చైర్మన్ పంగి పండరి, మాజీ వీడీసీ అధ్యక్షులు శివాజీరావు పటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ పుండ్లిక్, పంచాయతీ కార్యదర్శి జాదవ్ జాలాం సింగ్, గ్రామ పెద్దలు గోవింద్ పటేల్, అరుణ్ దేశ్‌పాండే, సోమ్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు. కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి.

# ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి
- జిల్లా కేంద్రంలో ప్రచారం
- ఘన స్వాగతం పలికిన కాలనీల వాసులు



ఈవీఎం నమూనాను వివరిస్తున్న నిర్మల్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



గంజాల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి సత్యనారాయణగౌడ్

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్, 27: ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలోని రవినగర్, శాస్త్రి నగర్, ఆస్రా కాలనీ, న్యూ ఆస్రా కాలనీల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మంత్రి అల్లోల మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీల మాటలకు మోసపోవద్దన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ చేసి చూపించారని గుర్తు చేశారు. గత పదేళ్లలో నిర్మల్ ఎంతో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. కొత్తగా జిల్లా ఏర్పాటుతో పాటు వైద్య కళాశాల మంజూరు చేసుకున్నామని చెప్పారు. నిర్మల్ పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనను ఆశీర్వదించి, కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. రాబోయే రోజుల్లో నిర్మల్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్, పాకాల రాంచందర్, స్థానిక కౌన్సిలర్ అన్వర్ పాషా, అమరగోని నర్సాగౌడ్, శ్రేణులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల

### ఆగం కావద్దు... ఆలోచించి ఓటేయండి

సోన్, నవంబర్ 27: గత పదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసిందని, ఈ సారి కూడా కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని పార్టీ మాజీ కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ అన్నారు. సోన్ మండలం గంజాల్ గ్రామంలో సోమవారం ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని సానికులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు రైతులకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. పార్టీ మ్యానిఫెస్టోను వివరించారు. ఎవరెన్ని మాటలు చెప్పినా నమ్మవద్దని, కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ మోహినొద్దీన్, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, నాయకులు అబు, మహేందర్, తదితరులున్నారు.

### ఇంటింటా ప్రచారం..

నిర్మల్ టౌన్, నవంబర్ 27: బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గెలిస్తేనే నిర్మల్ మరింత అభివృద్ధి చెందుతుందని నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌యాదవ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని బాగులవాడ, చిక్కడపల్లి, బోయవాడ, ఇంద్రనగర్‌లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలున్నారు.

## ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అశిష్ సాంగ్వాన్

నిర్మల్ టౌన్, నవంబర్ 27: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అశిష్ సాంగ్వాన్, జనరల్ అబ్జర్వర్ రవిరంజన్‌కుమార్ విక్రమ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల నిర్వహణపై జిల్లాలోని అన్ని మండలాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికల పోలింగ్ నిర్వహించబడుతుందన్నారు. ఇప్పటికే ఎన్నికల నియామవళి అధికారులకు వివరించామని, ఓటరు స్లిప్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపుకార్డుతో ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ముందుగానే ఈవీఎంల పనితీరుపై రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో పరిశీలించాలని సూచించారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ ఉంటుందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. పార్టీ అభ్యర్థులు తప్పా ఇతరులకు ఎవరికి లోనికి అనుమతి ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు గోపాలకృష్ణ, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్

## వైభవంగా కార్తీక పూజలు

ఖానాపూర్ టౌన్/ ఖానాపూర్ రూరల్, నవంబర్ 27: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా సోమవారం దేవాలయాల్లో అర్చనలు, అభిషేకాలు, దీపారాధనలు, రుద్రాభిషేకాలు చేశారు. సూర్యోదయా నికి ముందే భక్తులు స్నానాలు ఆచరించి, సమీప అలయాలకు వెళ్లి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించారు. దీంతో అన్ని అలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఉత్తర వాహిణి గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి గంగా గౌరి ఆలయ ప్రాంగణంలో ప్రమిదలు వెలిగించారు. పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. తర్లపాడు గ్రామంలోని ఓంకారేశ్వర ఆలయాన్ని కూడా దర్శించుకున్నారు. బక్కశెట్టి కిశోర్, బీరయ్య, దాసరి రాజన్న, పెద్ది మల్లేశ్, ద్యావతి రాజేశ్వర్, ఉన్నారు. దిలావర్‌పూర్ గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు.



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు